క్లుప్తంగా

ఎరువుల ధరలు పెంచడం దుర్మార్గం

జమ్మలమడుగు: రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలు పెంచేయడం అన్యాయమని మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రసాయన ఎరువుల ధరలు పెంచుతుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం రైతులను మోసం చేయడమే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది దాటినా ఇంత వరకు అన్నదాత సుఖీభవ సొమ్ము రైతుల ఖాతాలో జమచేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 50 కిలోల ఎరువు బస్తాపై రూ.50 నుంచి రూ.265 వరకు పెంచిందన్నారు. ఎరువుల ధరలను తగ్గించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకుని రావాలని డిమాండ్ చేశారు.

ఇస్మాయిల్ స్వామికి కానుకలు

సింహాద్రిపురం: మండలంలోని బిదినంచర్ల గ్రామంలో గత మూడు రోజులుగా ఇస్మాయిల్ స్వామి పీరు ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా భక్తుల నుంచి స్వామికి వచ్చిన కానుకలు, నగదు నిర్వాహకులు ఆదివారం లెక్కించారు. నగదు రూ.216420 రాగా, 90 వెండి గొడుగులు, ఒక వెండి ఊయల, వెండి గుర్రం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆనకట్ట వద్ద బోర్డుల ఏర్పాటు



బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వల్లూరు: వల్లూరు మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. ఎస్ఐ పెద్ద ఓబన్న ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఆనకట్టను సందర్శించారు. పెన్నా నదిలో నీటి ప్రవాహం అధికంగా వున్న కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలున్న నేపథ్యంలో ఆనకట్ట ప్రాంతాన్ని నిషేధిత స్థలంగా గుర్తించి బోర్డులను ఏర్పాటు చేశారు. ఎవరూ నదిలో దిగరాదని, నిబంధన అతిక్రమించి నదిలో దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బోర్డులో సూచించారు. అనంతరం పర్యాటకులకు ఎస్ఐ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.

నోటిఫికేషన్ ఇవ్వాలి

జమ్మలమడుగు: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరం మొదలై రెండు నెలలు పూర్తి కావస్తున్నా.. ఇంత వరకూ అడ్మిషన్లకు సంబంధించిన నోటిఫికేషన్ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు.ప్రైవేట్ కాలేజీలు ప్రచారం చేసుకుని విద్యార్థులను చేర్పించుకునే ప్రక్రియ ప్రారంభించాయని తెలిపారు. వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


అధ్యక్షుడిగా ప్రశాంత్‌కుమార్



పత్రాన్ని అందుకుంటున్న ప్రశాంత్ కుమార్

పులివెందుల టౌన్: కడప జిల్లా రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా దేరంగుల ప్రశాంత్‌కుమార్ ఎంపికయ్యారు. ఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు పోతుల నాగరాజు ఆదివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రిజర్వేషన్ వర్గాల ఐక్యతకు, అభివృద్ధికి, వారి హక్కుల సాధన కోసం చట్ట సభలలో బీసీల రిజర్వేషన్ల సాధన కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద పోస్టర్లను ముద్రించవద్దు



మాట్లాడుతున్న సీఐ నరసింహులు

వేంపల్లె: వివాదాస్పద ఘటనలకు సంబంధించి పోస్టర్లను ఎవరు కూడా ముద్రించవద్దని వేంపల్లి సీఐ నరసింహులు సూచించారు. వేంపల్లి పోలీస్ స్టేషన్లో ప్రింటింగ్ ప్రెస్, ఇంటర్నెట్ సెంటర్లు, ఫ్లెక్సీ ప్రింటర్లు, జిరాక్స్ సెంటర్ల యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి వారికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు గ్రూపులు, రెండు వర్గాల మధ్య వివాదాస్పదంగా ఉండేలా పోస్టర్లు ముద్రించవద్దని తెలిపారు. ఎవరైనా ముద్రించమని వస్తే ప్రతి కాపీలో చిరునామా పేర్కొనాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే సంబంధిత షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

నిర్వహణ బరువు.. ఆహ్లాదం కరవు



వాకింగ్ ట్రాక్‌కు అడ్డుగా పెరిగిన మొక్కలు



నిరుపయోగంగా గుర్రపుస్వారీ ప్రాంతం

పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డు వద్ద కోట్లాది రూపాయలతో ఏర్పాటుచేసిన నగరవనాన్ని సంరక్షించుకోలేని పరిస్థితి. లక్షల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఈ వనాన్ని పట్టించుకునే నాథులే కరవయ్యారు.

గుర్రపుస్వారీ కేంద్రం నిరుపయోగం
ముళ్లకంపలతో వాకర్లకు ఇబ్బందులు

పులివెందుల టౌన్: ఇందిరమ్మ రాణి తోపు పార్కును అత్యంత సుందరీకరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నగర వనంగా పేరుమార్చారు. రూ.16.18 కోట్లతో అత్యంత సుందరీకరంగా తీర్చిదిద్దారు. అరుదైన మొక్కలు, స్టోన్ గజీబు, హార్స్ రైడింగ్, చిన్న పిల్లల ఆట స్థలం, ఊయలలు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, మొక్కల సంరక్షణకు పైపులు ఏర్పాటు చేశారు. మొక్కలకు తడులు, నీటి మోటార్లు ఏర్పాటు, దారి పొడవునా లైట్లు, మరుగుదొడ్లు ఇలా అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ పార్కు మెయింటెనెన్స్ గాలికి వదిలేశారు. దీంతో దారిపొడవునా మొక్కలు అడ్డగోలుగా పెరిగి పాదచారులకు ఇబ్బందిగా మారుతున్నాయి. ఆహ్లాదంగా ఉండే నగరవనాన్ని పట్టించుకుంటే వాకింగ్ చేసేవారితోపాటు సందర్శకులు పెరిగే అవకాశాలున్నాయి.

నిరుపయోగంగా గుర్రపు స్వారీ ప్రాంతం

నగరవనంలోని గుర్రం స్వారీ కేంద్రంలో రెండు గుర్రాలు అందుబాటులో ఉండి సందర్శకులకు స్వారీలో శిక్షణ ఇస్తూ ఉండేవారు. వాటి సంరక్షణ లేకపోవడంతో ఆ గుర్రాలను గండికోటకు తరలించారు. దీంతో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన గుర్రపు స్వారీ ప్రాంతం, గదులు నిరుపయోగం మారాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడం,



ఉపయోగం లేని గుర్రాల గదులు

అధికారులు మెయింటెనెన్స్ చేయకపోవడంతో మొక్కలు అడ్డగోలుగా పెరిగి ఇబ్బందికరంగా తయారయ్యాయి. ప్రతి రోజూ ఉదయం వాకింగ్ కోసం వచ్చేవారంతా సరైన సదుపాయాలు లేక ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోతున్నారు. నగర వనం మెయింటెనెన్స్ చేస్తే వాకింగ్ వచ్చేవారితో పాటు సందర్శకుల తాకిడి పెరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

గుర్రపు స్వారీని కొనసాగించాలి



నగరవనంలో ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన గుర్రపు స్వారీ చాలా బాగుంది. చాలామంది శిక్షణ పొందేవారు. కూటమి ప్రభుత్వం మెయింటెనెన్స్ చేయలేక గుర్రాలను వేరే ప్రాంతాలకు తరలించారు. దీంతో ఇది నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుర్రపు స్వారీని యథావిధిగా కొనసాగిస్తే బాగుంటుంది.

– అనేష్‌రెడ్డి, పులివెందుల

నగరవనం.. సంరక్షణ కరవు



గత ప్రభుత్వం కోట్లాది రూపాయలతో సుందరీకరించిన నగరవనానికి ప్రస్తుతం సంరక్షణ కరవైంది. ఈ పార్కులోని మొక్కలు అడ్డగోలుగా పెరగడంతో వాకింగ్ చేసేవారికి ఇబ్బందికరంగా ఉంది. ఈ ప్రాంతాన్ని మెయింటెన్స్ చేస్తే చాలా బాగుంటుంది. దీంతో పాదచారులు, సందర్శకులు సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

– కిషోర్, పులివెందుల

డాక్టర్ లేక పశు వైద్యశాలల మూత

కొండాపురం: వ్యవసాయం గిట్టుబాటు కాని రైతులు దాని అనుబంధరంగమైన పాడి పరిశ్రమను నమ్ముకొని జీవిస్తున్నారు. పశువులు వ్యాధుల బారినపడినప్పుడు పశు వైద్యశాలలో సిబ్బంది లేక పశుపోషకులు ఇబ్బంది పడుతున్నారు. మండలం లోని బి.కొట్టాలపల్లె గ్రామీణ పశువైద్యశాలకు బెడుదూరు, ఉస్తికాయలపల్లె, కోనవారిపల్లె, కొత్తపల్లె, యనమలచింతల, చవ్వనాగాయపల్లె గ్రామాల పశువులను చికిత్స కోసం తీసుకువస్తారు. చౌటిపల్లె గ్రామీణ పశు వైద్యశాలకు ఓబన్నపేట, గండ్లూరు, శీతాపురం, రేపల్లె వాసులు ఆశ్రయిస్తుంటారు. గత రెండు నెలల నుంచి ఈ వైద్యశాలల్లో వైద్యుడు లేకపోవడంతో మూతపడ్డాయి. తాళ్లప్రొద్దుటూరులో పశు వైద్యశాల పరిధిలో 15 పంచాయతీలుండగా



బి.కొట్టాలపల్లెలో మూత పడిన పశు వైద్యశాల

అక్కడ విధులు నిర్వహిస్తున్న పశు వైద్యురాలు రమ్య బదిలీపై వెళ్లి రెండు సంవత్సరాలు గడచింది. ఇప్పటి వరకై డాక్టర్‌ను నియమించకపోవడంతో మూతపడ్డాయి. అధికారులు స్పందించి సిబ్బంది ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

17న మాదిగల విజయోత్సవ సభ

ముద్దనూరు: ఈ నెల 17న విజయవాడలో మాదిగల విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎమ్మార్పీయస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ తెలిపారు. సభను జయప్రదం చేయాలని కోరుతూ ఎమ్మార్పీయస్ నాయకులు ఆదివారం సభ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో చట్టం చేయాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం వచ్చి 35ఏళ్లు గడిచినా ఇప్పటికీ దళితులపై నేరాలు తగ్గలేదని అన్నారు. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూముల రక్షణకు రిటైర్డ్ ఐఏయస్ అధికారిపై కమిషన్ వేయించాలని కోరుతూ నిర్వహించే



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

విజయోత్సవ సభకు మాదిగలంతా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, జయరాం, ఓబులేసు, గంగయ్య, బాలాంజనేయులు, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు నెరవేర్చడంలో నిర్లక్ష్యం

కమలాపురం: కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. కమలాపురంలో చలో ఢిల్లీ పోస్టర్లను ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన విభజన హామీలు నేటికీ అమలు చేసేందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పారని, ఇపుడేమో ముగిసిన అధ్యాయం అంటున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ హయాంలో సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు నిర్మిస్తామని హామీ ఇచ్చారని, గడచిన పార్లమెంటు సమావేశాల్లో ఉక్కు పరిశ్రమకు ఎందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు. సీమకు



పోస్టర్లను విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బుందేల్‌ఖడ్ తరహా ప్యాకేజీ కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రాంత ప్రజలపై వైఖరి అర్థం అవుతోందన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టామని, అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మిరప సాగులో రైతులు నిమగ్నం

పులివెందుల రూరల్: నియోజకవర్గ వ్యాప్తంగా మిరప పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. నెల రోజుల కిందట 50 కిలోల బస్తా రూ.800 నుంచి రూ.1200 పలికింది. ఇపుడు మార్కెట్లో 50 కిలోల బస్తా రూ.2500 నుంచి రూ.3వేలు పలుకుతోంది. దీంతో రైతులు మరింతమంది మిరప సాగులో నిమగ్నమవుతున్నారు. నియోజకవర్గంలోని పులివెందుల, తొండూరు, లింగాల, వేముల, సింహాద్రిపురం, చక్రాయపేట, వేంపల్లె మండలాల్లో ఎక్కడ చూసినా మిరప పంటలను సాగు చేశారు. ధరలు ఇలాగే కొనసాగితే బాగుంటుందని రైతులు కోరుతున్నారు. బోర్ల కింద సాగు చేసిన పంటల దిగుబడులు బాగానే ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.



పులివెందుల ప్రాంతంలో సాగులో ఉన్న మిరప

ఎరువుల ధర పెంచి రైతుపై భారం మోపొద్దు

వేంపల్లె: రైతులపై ఎరువుల భారం మోపద్దని వైఎస్సార్‌సీపీ కడప జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఎం.మస్తాన్ రెడ్డి అన్నారు. విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రసాయన ఎరువుల ధర పెంచుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెక్కినట్టుఉందని తెలిపారు. ఒక్కొక్క ఎరువు బస్తాకు రూ.50 నుంచి రూ.265 రూపాయల వరకు పెంచిందన్నారు. ఫాటాస్ ఎరువుపై రూ.265 పెంచారని, 10-26-26 ఎరువుపై రూ.25 పెరిగిందన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైన ఇంతవరకూ వర్షాలు పడక రైతులు లబోదిబోమంటుంటే.. ఎరువులు రేట్లు పెంచడం దారుణమని అన్నారు. కేంద్రం రైతులపై కపట ప్రేమ చూపిస్తోందని, పీఎం కిసాన్ డబ్బుల కోసం ప్రధానమంత్రి ఎరువు ధర పెంచుకుంటూ పోవడం దారుణమని రైతులు వాపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర మంత్రితో మాట్లాడి ఎరువుల రేట్లు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని రైతుల తరఫున వైఎస్సార్‌సీపీ కోరుతోందన్నారు.



మస్తాన్ రెడ్డి

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పెద్ద హైస్కూల్‌లో ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కమలాపురం: మండలంలోని పెద్దచెప్పలి హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఆదివారం ఒకే చోట కలిసి ఉత్సాహంగా గడిపారు. 2000–01 సంవత్సరంలో పాఠశాలలో పదో తరగతి చదివిన 50 మంది విద్యార్థులంతా కలుసుకునేసరికి ఆ ప్రాంతం సందడిగా మారింది. హైస్కూల్‌లో చదువుకున్న ఆ విద్యార్థులకు పాఠాలు బోధించిన వారిని ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. చదువుకొనే సమయంలో విద్యార్థులు చేసిన తప్పులు, ఉపాధ్యాయుల చేతుల్లో తిన్న దెబ్బలను నెమరువేసుకుని నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ ఆస్వాదించారు. 25 ఏళ్ల తర్వాత కూడా 50 మంది కలవడం అభినందనీయమన్నారు. కలిసి మెలిసి ఉండాలని పూర్వ విద్యార్థులకు సూచించారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి

కమలాపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కమలాపురం విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆర్‌టీబీ నిర్మాణం చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజ్ వ్యవస్థను పూర్తిచేయాలన్నారు. సర్వరాయ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి పంట కాలువలను తవ్వి తద్వారా రైతు పొలాలకు నీళ్లు ఇవ్వాలన్నారు. చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక సమృద్ధి చేయాలన్నారు. అలాగే ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

పీర్ల ఊరేగింపు



పీర్ల ఊరేగింపు

పులివెందుల టౌన్: మండలంలోని వెంకటాపురంలో పీర్ల పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీర్లను ముస్తాబు చేసి వివిధ వేషధారణ, డప్పు వాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు పీర్లకు చక్కెర చదివించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఇమామ్ బాషాకు నివాళి

పులివెందుల టౌన్: పట్టణంలోని మారుతీహాల్ సమీపంలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త ఇమామ్‌బాషా ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్.మనోహర్‌రెడ్డి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ వరప్రసాద్, హైల్ గంగాధర్‌రెడ్డి, పార్నపల్లె కిషోర్, నూరుబాషా సంఘ అధ్యక్షుడు రసూల్, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి విశేష అలంకారం

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, నిమ్మకాయలు, గంధం, పసుపు, వేపాకు, తోమాలలతో విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కుబడులను చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు పట్టి కోళ్లు, పొట్టేలు, మేకపోతులను బలి ఇచ్చారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మ ఆలయం సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో కూడా భక్తులు పూజలు నిర్వహించారు.



అలంకరణలో గంగమ్మ తల్లి



తాడిగొట్లలోని అమ్మవారు

తాడిగొట్లలో: తాడిగొట్ల గ్రామ ప్రజలు వర్షాలు కురిసి పాడిపంటలు సంవృద్ధిగా పండాలని గ్రామంలోని గంగమ్మ, ఎల్లమ్మ దేవతలకు బోనాలు సమర్పించి విశేష పూజలు నిర్వహించారు.

పతంజలి యోగా గురూజీ చిరస్మరణీయుడు

పులివెందుల టౌన్: పతంజలి సంపూర్ణ యోగ ప్రచార సమితి యోగ గురువు టి.హనుమంత రెడ్డి గురూజీ చిరస్మరణీయుడని విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం యోగా గురూజీ ఏడవ వర్ధంతి సందర్భంగా సరస్వతీ విద్యా మందిరంలో యోగ సాధకులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హనుమంతరెడ్డి గురూజీ ఎంతో మందికి యోగ విద్య ప్రసాదించారన్నారు. యోగ, హీలింగ్ థెరపీ, ఆక్యు ప్రెజర్ ద్వారా అనేక జబ్బులు నయంచేశారన్నారు. 2018 జూలై, 28 శివైక్యం చెందారని, ఆయన అడుగుజాడలోనే యోగా శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. అనంతరం పలువురు వక్తలు హనుమంతరెడ్డి గురూజీ గురించి మాట్లాడారు. కార్యక్రమంలో మునికుమార్, నాగరాజు, పుల్లారెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, యోగసాధకులు పాల్గొన్నారు.



గురూజీకి నివాళులర్పిస్తున్న యోగ ప్రముఖులు

నేరేడు పండు.. ఆరోగ్యం మెండు

పులివెందుల రూరల్: ప్రకృతి ప్రసాదించే పండ్లలో నేరేడు పండు ఒక్కటి. ఆరోగ్య ప్రదాయినిగా ఎంతో మేలు చేకూర్చి.. రక్తాన్ని శుద్ధి చేసే ఔషధ విలువలు కలిగిన నేరేడు పండు సీజన్ వచ్చేసింది. తినడానికి తియ్యగా కొంచెం వగరుగా ఉన్న ఈ పండ్లను ఆయుర్వేద శాస్త్రంలో అపర సంజీవినిగా పిలుస్తారు. శరీరంలో ఏర్పడే అనేక రోగాలను ఇవి దూరం చేస్తాయి. రుచిలో మేటిగా ఉండే ఈ పండ్లేగాక, వాటి ఆకులు, బెరుడు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

పండ్లలో ఐరన్, కాల్షియం

పులివెందుల నియోజక వర్గ వ్యాప్తంగా కూడా నేరేడు పండ్ల తోటలు అధికంగానే రైతులు సాగు చేశారు. ప్రారంభ దశలో నేరేడు పండ్లు కిలో రూ. 200 ధర పలికింది. రాను రానూ కిలో మార్కెట్‌లో రూ.100కు పడిపోయినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో నేరేడు పండ్లు విరివిగా లభిస్తున్నాయి. నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియం తోపాటు ఎ, సి, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ వ్యాధుల నుంచి రక్షించు కోవచ్చు. నేరేడు మూత్ర సమస్యల నియంత్రణ తోపాటు మధుమేహం, అదుపులో ఉంచుతుంది. ముఖ్యంగా కిడ్నీలను శుభ్ర పరచి, మూత్రాశయంలోని ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. కాలానుగుణంగా వచ్చే పండ్లను ప్రతి ఒక్కరూ తినాలని వైద్యులు చెబుతుంటారు. నేరేడు పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.



మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నేరేడు పండ్లు

ఆరోగ్యానికి మంచిది...



ప్రస్తుతం మార్కెట్లో విరివిగా లభించే సీజనల్ నేరేడు పండ్లు తింటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ పండ్లు అనేక రోగాలు రాకుండా చేస్తాయి. వీటిని నానబెట్టి ఆ నీటిని తీసుకుంటే అజీర్తి, అతిసారం, కలరా, వ్యాధులు తగ్గుతాయి.

– నాగేంద్ర, స్థానికుడు

పోషకాలు ఎన్నో.. ఉన్నాయి



నేరేడు పండ్లలో క్యాల్షియం, ఐరెన్, విటమిన్ ఎ, సిఉంటాయి. వీటిని తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మూత్ర సమస్యలు నియంత్రణలో ఉంటాయి. గుండె, మెదడు బాగా పని చేస్తాయి. దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.

– శశిభూషన్, పులివెందుల